# ప్రజా మాటల

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 31 | ఆదివారం | 27 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2




తెలంగాణలో టెట్ ఫలితాలు విడుదల..
70.07 శాతం ఉత్తీర్ణత

# ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం
# నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు

- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ
- తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్ గా ఉందని వెల్లడి



**హైదరాబాద్ :**
ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో - మిగతా 2 లో

## కాళేశ్వరం ప్రాజెక్టు
# పునరుద్ధరణ పనులు



- ప్రభుత్వం కీలక ప్రకటన
- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు
- భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్ :**
కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. - మిగతా 2 లో



# రేవంత్‌రెడ్డి 'నిజాయతీ గల మోసగాడు'

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు

**హైదరాబాద్ :**
సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు - మిగతా 2 లో



## పండగల సీజన్‌లో
# బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు

2 లో..


## 20 శాతం మంది
# టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు



- సీజేఐ సూర్యకాంత్ ఆందోళన
- టీనేజర్లలో డ్రగ్స్ ముప్పుపై సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- సమగ్ర పునరావాసం అవసరమని వెల్లడి
- పిల్లలు డ్రగ్స్ బారిన పడటానికి గల కారణాలను గుర్తించాలని సూచన

**ఢిల్లీ :**
దేశంలో ఉన్న టీనేజర్స్‌లో 20 శాతానికి పైగా మంది మాదకద్రవ్యాల బారిన పడే ముప్పును ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పట్నాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకున్న పిల్లలను కేవలం రికార్డుల్లో గణాంకల్లా చూడకూడదన్నారు. వారిని ఆ మార్గంలోకి నెట్టిన విభిన్న పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వారికి తమ బాల్యాన్ని తిరిగిచ్చే పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఆగస్టులో ప్రముఖ జర్నల్ 'లాన్సెట్ రీజినల్ హెల్త్- సౌత్‌ఈస్ట్ ఆసియా' ప్రచురించిన ఒక అధ్యయనాన్ని సీజేఐ ప్రస్తావించారు. దేశంలోని ప్రతి ఐదుగురు టీనేజర్లలో ఒకరి కంటే ఎక్కువ మంది మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం అంచనా వేసిందనట్లు చెప్పారు. ఈ సమస్య టీనేజర్ల వర్గానికి మాత్రమే పరిమితమైనది కాదన్నారు. యువత అవసరాలను గుర్తించి - మిగతా 2 లో

## బాలాపూర్ రికార్డు బద్దలు దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!



2 లో..

- దక్కించుకున్న స్థానిక భక్తుడు రాజేష్
- ఇక్కడే మరో లడ్డూకు రూ.25 లక్షలు
- వేలం నిధులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్న నిర్వాహకులు


# పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

- పాకిస్థాన్‌లో పోలీసు చెక్‌పోస్ట్‌పై ఆత్మాహుతి దాడి
- ఈ ఘటనలో 11 మంది మృతి, 30 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న తెహ్రీక్-ఇ-తాలిబన్



**ఢిల్లీ :**
పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి మారణహోమం సృష్టించారు. వాయవ్య పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం చోటుచేసుకున్న ఆత్మాహుతి దాడిలో కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత - మిగతా 2 లో

## ప్రజానాడి




## విజయవాడలో
# 'పేదలకు పట్టాభిషేకం'



- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు ప్రయోజనం

**అమరావతి :**
పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల - మిగతా 2 లో

## పిక్సెల్స్ అయినా, పైపులైనా..
# లక్ష్యం ఒక్కటే

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- 'ది ప్రింట్' కథనంపై సీఎం చంద్రబాబు స్పందన
- ది ప్రింట్ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పోస్టుపై స్పందించిన చంద్రబాబు
- పిక్సెల్స్ నుంచి పైపుల వైపు తన పాలన పయనం సాగిందన్న సీఎం
- అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి చేరాలన్నదే తన నమ్మకమని వెల్లడి
- సమస్యల పరిష్కారం, జీవనోపాధి కల్పనే ప్రధాన ఉద్దేశమని స్పష్టీకరణ
- చివరి ఆయకట్టు రైతులకు నీరందించడమే లక్ష్యం



**అమరావతి :**
ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ది ప్రింట్' వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. 'పిక్సెల్స్ నుంచి పైపుల వైపు' సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు. 'ది ప్రింట్' మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన 'సీఈఓ-సీఎం' ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు 'పిక్సెల్స్' (టెక్నాలజీ) నుంచి 'పైపుల' (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం చుట్టూ ముడిపడి ఉంది. అభివృద్ధి ఫలాలు కచ్చితంగా ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరచాలి. 1990లలో మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా టెక్నాలజీ - మిగతా 2 లో

# సంపాదకీయం

## తీరిన ముచ్చట!




నా లక్ష్యం నెరవేరిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ముచ్చటపడుతున్నారు. దానికంటే ముఖ్యంగా, తన బెదిరింపులకు జడిసి ప్రత్యర్థులు కాళ్ళబేరానికి వచ్చారని చూపుకోవడం ఆయనకు మరింత సరదా. మంగళవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని ట్రంప్ ఆకాశానికి ఎత్తేశారు. ఈ త్రైపాక్షిక ఒప్పందంతో గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా మరో రెండు సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకొనేందుకు వీలుకలుగుతుందట. అమెరికా ఉనికిని పెంచడంతోపాటు, దాని ప్రత్యర్థులెవ్వరూ ఆ ద్వీపంలో కాలూనకుండా ఈ కొత్త ఒప్పందం నిరోధిస్తుందే తప్ప, అమలులో ఉన్న 1951నాటి ఒప్పందాన్ని వమ్ముచేసే అంశాలేవీ ఇందులో లేవని గ్రీన్‌లాండ్, డెన్మార్క్ చెబుతున్నాయి. తాను చేసిన ఈ సంతకంతో అమెరికాకు ఆర్కిటిక్ మీద శాశ్వత నియంత్రణ దఖలుపడినట్టుగా ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని అదేపనిగా ట్రంప్ బెదిరిస్తూ వచ్చిన నేపథ్యంలో ఈ ఒప్పందం జరిగిందన్నది నిజం. గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాకు అమ్మేయాలని, లేదంటే సైనికచర్యతోనైనా దానిని స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వేధించడం మొదలుపెట్టి, ఈ ఏడాది జనవరిలో ఆయన ఏకంగా కెనడా, వెనెజువెలా, గ్రీన్‌ల్యాండ్‌లను అమెరికా మ్యాప్‌లో కలిపేసి తన ట్రూత్‌సోషల్‌లో ఆ చిత్రాన్ని పోస్టుచేశారు కూడా. కృత్రిమమేధతో రూపొందిన ఆ రెండు చిత్రాల్లో ఒకదానిలో ఆయన గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికా జెండా పాతుతున్నారు, మరోదానిలో ఈ సరికొత్త అమెరికా మ్యాప్ వెనుక ఉండగా, యూరోపియన్ కమిషన్, నాటో సెక్రటరీ జనరల్ సహా మిగతా దేశాధినేతలంతా ఆయన చెబుతున్నదానిని నోరుమూసుకొని వింటున్నారు. గ్రీన్‌ల్యాండ్ విషయంలో తానేంచేసినా ఈయూ మారుమాట్లాడబోదని దాని అర్థం. అమెరికా అంత బలమైన దేశం ప్రపంచంలోనే లేదనీ, దాని రక్షణకు గ్రీన్‌ల్యాండ్ అత్యావశ్యకమని, అమెరికా రక్షకుడినైన తాను గనుక ఊరుకుంటే చైనా, రష్యాల చేతుల్లోకి గ్రీన్‌ల్యాండ్ పోతుందని బెదిరించేవారు ట్రంప్. అమ్ముడుపోతారా, ఆక్రమించుకోమంటారా అంటూ ఆయన అదేపనిగా హెచ్చరికలు చేస్తూండటంతో ఈ ఆర్కిటిక్ ద్వీపకల్పాన్ని పాక్షికంగా నియంత్రిస్తున్న డెన్మార్క్ అక్కడకు సైన్యాన్ని కూడా పంపి, తన ప్రతిఘటన తెలియచేసింది. 'నోరాడ్'లో భాగంగా అమెరికన్ యుద్ధ విమానాలను గ్రీన్‌ల్యాండ్‌కు తరలించి ఉద్రిక్తతలను పెంచేశారు ట్రంప్. తాము డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండర్స్ ముక్తకంఠంతో నినదించారు, రోడ్లమీదకు వచ్చారు. గ్రీన్‌ల్యాండ్‌ను కొందామా, కొట్టేద్దామా అన్నది ట్రంప్ త్వరలోనే నిర్ణయిస్తారంటూ ఆయన మంత్రులంతా అదేపనిగా చెబుతూండేవారు. అమెరికా పక్షాన నిలవకుండా డెన్మార్క్‌ను వెనకేసుకొస్తున్నందుకు ఐరోపా దేశాల మీద ట్రంప్ విరుచుకుపడేవారు.ఏఐ మ్యాప్‌లో వెనెజువెలాను కలిపేసుకున్న ట్రంప్, అంతిమంగా దాని విలీనాన్ని ఎలా సాధించాడో తెలిసిందే. గ్రీన్‌ల్యాండ్ లక్ష్యాన్ని కూడా ఆయన వదిలిపెట్టడన్నది ఊహించిందే. భౌతికంగా దానిని దురాక్రమించకుండా ఈ ఒప్పందం ద్వారా తాను కోరిన దానిలో కొంత నెరవేర్చుకున్నాడాయన. గ్రీన్‌ల్యాండ్‌లో ఇప్పటికే ఉన్న అమెరికా స్థావరాలను బలోపేతం చేయడం, విస్తరించడం, ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేసుకోవడానికి ఈ ఒప్పందం వీలుకల్పిస్తుంది. నెలల తరబడి కొనసాగిన అనిశ్చితి దీనితో ముగిసిందనీ, తమ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకు, గ్రీన్‌ల్యాండ్ ప్రజల స్వీయ నిర్ణయాధికారానికీ ఈ ఒప్పందంతో ఏ లోటూ రాదని డెన్మార్క్ చెప్పుకుంటోంది. ఈ కీలక ప్రాంతంలో భద్రత, సహకారాలకు ఇక ఏ అడ్డంకులూ ఉండవని నాటో చప్పట్లు చరుస్తోంది. ఈ ఒప్పందంతో అమెరికాకు దక్కింది కానీ, డెన్మార్క్ కోల్పోయింది కానీ పెద్దగా లేదని, అయితే, 'పర్మనెంట్ కంట్రోల్' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలో పరమార్థం భవిష్యత్తులో తెలుస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఉపరితలంలో కథ సుఖాంతమైనట్టు కనిపించినా, ట్రంప్ అనుచిత, అహంకార ధోరణిని డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ఎన్నటికీ విస్మరించలేవు.

## పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే

**మొదటిపేజీ తరువాయి -** పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, కొత్త అవకాశాలు సృష్టించడం నా ముందున్న కర్తవ్యం. కానీ, ఈ రోజు నా ప్రాధాన్యత మరింత మౌలికమైనది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మన రైతులకు, ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే నా ముందున్న అతిపెద్ద లక్ష్యం" అని వివరించారు."అది పిక్సెల్స్ అయినా, పైపులైనా.. రెండింటి ఉద్దేశం ఒక్కటే. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవనోపాధిని బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి మెరుగైన భవిష్యత్తును నిర్మించడం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రయాణాన్ని కథనంలో చక్కగా వివరించినందుకు శేఖర్ గుప్తాకు, 'ది ప్రింట్' మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 'హైటెక్ సీఎం'గా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి పెద్దపీట వేసిన నేతగా గుర్తింపు పొందారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన పాలనా ప్రాధాన్యతలు కాలానికి అనుగుణంగా మారతాయే తప్ప, ప్రజలకు సేవ చేయాలనే అసలు లక్ష్యం మాత్రం మారదని చంద్రబాబు తన స్పందన ద్వారా స్పష్టం చేశారు.

## లెక్కలేనంత మంది వైసీపీ నేతలపై కేసులు పెట్టారు

**మొదటిపేజీ తరువాయి -** విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబుకు వినతిపత్రం అందించారు. ఘటనకు సంబంధం లేని వారిపై కూడా కేసులు పెట్టారని సీపీ దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం అంబటి మీడియాతో మాట్లాడుతూ... లెక్కలేనంత మంది వైసీపీ నేతలపై కేసులు పెట్టారని అన్నారు. నిరసన సమయంలో పోలీసులు మితిమీరిన చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. విజయవాడలో మల్లాది విష్ణు ధర్నా చేస్తే ఆయనపై కోడిగుడ్లతో దాడి చేశారని... దాడి చేసిన వారిపై ఒక్క కేసు కూడా పెట్టలేదని మండిపడ్డారు.కోర్టులు అక్షింతలు వేసిన పోలీసుల తీరు మారడం లేదని అంబటి విమర్శించారు. తప్పుడు కేసులు పెడుతూ పోలీసులు అభాసుపాలు అవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎస్సీ నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులపై రౌడీషీట్లు తెరవడం ఏ ప్రాతిపదికన జరుగుతోందని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేశ్ మామాళ్ల దందా నడిపిస్తున్నారని... ఆయనపై కూడా రౌడీషీట్ పెట్టాలని అన్నారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి.. 11 మంది మృతి

**మొదటిపేజీ తరువాయి -** పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ఒక రహదారి పక్కన ఉన్న పోలీసు చెక్‌పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో నింపిన వాహనంతో వచ్చిన ఆత్మాహుతి బాంబర్, చెక్‌పోస్ట్ సమీపంలోకి రాగానే తనను తాను పేల్చుకున్నాడు. ఈ పేలుడు ధాటికి ఆ ప్రాంతం ఒక్కసారిగా దద్దరిల్లింది. ఈ ఘటనలో భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఘాతుకానికి తమదే బాధ్యతని పాకిస్థానీ తాలిబన్‌గా పిలిచే తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించింది. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా టీటీపీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి వేర్పాటువాద సంస్థలు వరుస దాడులకు పాల్పడుతున్నాయి. ఈ తాజా ఘటనతో దేశంలోని భద్రతా వ్యవస్థలోని లోపాలపై మరోసారి తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## 20 శాతం మంది టీనేజర్లకు డ్రగ్స్ ముప్పు

**మొదటిపేజీ తరువాయి -** దీన్ని నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.డ్రగ్స్ బారిన పడిన పిల్లల గురించి గణాంకాలు చెప్పడం ఎంత ముఖ్యమో, వారి బాధలను అర్థం చేసుకోవడం కూడా అంతే ముఖ్యమని సీజేఐ సూచించారు. ఒకరు బాధితుడు కావడానికి రకరకాల కారణాలు ఉంటాయని చెప్పారు. చెడు స్నేహాలు, ఇంట్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం, ఆశ్రయం లేకపోవడం, వేధింపులు లేదా డ్రగ్స్ ఉండే వాతావరణంలో పెరగడం వంటి రకరకాల కారణాల వల్ల చదువుకు దూరమై పిల్లలు ఈ చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని చెప్పుకొచ్చారు. డ్రగ్స్ బారిన పడే మార్గాలు వేర్వేరుగా ఉన్నప్పుడు, వాటి పరిష్కారానికి అనుసరించే విధానాలు కూడా విభిన్నంగా ఉండాలని సీజేఐ సూచించారు. ఒక సమస్యతో తమ ముందుకు వచ్చిన పిల్లలను ఆ కోణంలోనే చూడకూడదన్నారు. పిల్లల రక్షణ కేవలం రెస్క్యూ చేయడంతోనే ఆగిపోకూడదన్నారు. చికిత్స, డిశ్చార్జ్ తర్వాత సుస్థిరమైన పునరావాస వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.

# విజయవాడలో 'పేదలకు పట్టాభిషేకం'

**మొదటిపేజీ తరువాయి -** సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు.విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిపై లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులను కట్టబెడుతోంది. ఈ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 9,800 కోట్ల విలువైన 617 ఎకరాల భూమిపై పేద, మధ్య తరగతి కుటుంబాలకు అధికారం లభించనుంది. దీనివల్ల




ఒక్కో కుటుంబానికి సుమారు రూ. 40 లక్షల నుంచి రూ. 45 లక్షల వరకు లబ్ది చేకూరనుంది. ముఖ్యంగా, విజయవాడ నగరంలోని మూడు నియోజకవర్గాల పరిధిలో కొండలపై ఇళ్లు నిర్మించుకున్న వారి చిరకాల స్వప్నం ఈ కార్యక్రమంతో నెరవేరబోతోంది. తమ ఇళ్లకు శాశ్వత భద్రత, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కొండ ప్రాంత నివాసితులు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు.ఇటీవల జరిగిన జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలోనూ ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం వేగంగా స్పందించి, ఇప్పుడు 29.86 లక్షల చదరపు గజాల స్థలంపై లబ్దిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. క్రమబద్ధీకరణ చేస్తున్న భూముల మార్కెట్ విలువ దాదాపు రూ. 24,297 కోట్లుగా ఉంటుందని అంచనా.ఈ పట్టాల పంపిణీ ద్వారా ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు, కృష్ణా జిల్లాలోని గన్నవరం సహా మొత్తం 8 నియోజకవర్గాల్లోని 15 మండలాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీలు 12,093, ఓసీలు 6,130, ఎస్సీలు 4,546, ముస్లిం బీసీలు 955, ఎస్టీలు 333 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నాయి.

# పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

**మొదటిపేజీ తరువాయి -** అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది.ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు.పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక



బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

## బాలాపూర్ రికార్డు బద్దలు

**మొదటిపేజీ తరువాయి -** భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది.దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌లతో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు.చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు వెచ్చించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది.ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు.గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.లడ్డూ వేలం ద్వారా వచ్చిన నిధులను సామాజిక, సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని జై గణేశ్ యూత్ అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు.

## ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు

**మొదటిపేజీ తరువాయి -** మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు.ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, డల్లాస్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు.తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని, ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లకు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.ం

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు

**మొదటిపేజీ తరువాయి -** ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు.బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు.బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

## రేవంత్‌రెడ్డి 'నిజాయతీ గల మోసగాడు'



**మొదటిపేజీ తరువాయి -** పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు.2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

# హైదరాబాద్‌లో ముగిసిన గణేశ్ నిమజ్జనాలు

**సంతోషంతో సిబ్బందితో డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనర్**

**హైదరాబాద్‌లో వినాయక శోభయాత్ర దిగ్విజయంగా**

**ముగియడం పోలీసుల్లో జోష్‌ను పెంచింది**

**మధ్యాహ్నం చివరి గణపతి గంగమ్మ ఒడికి చేరిన**

**తరువాత పోలీసులు సంతోషంతో డ్యాన్స్ చేశారు**

**సీపీ సజ్జనర్ కూడా వారితో కలిసిపోయారు.**

**స్టెప్పులేసిన సీపీ సజ్జనర్**

**అధికారులతో కలిసి స్టెప్పులేసిన సీపీ సజ్జనర్**



భాగ్యనగరంలో వినాయక నిమజ్జనం.. పరిపూర్ణమైంది. అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికతో చేసిన ఏర్పాట్లతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. ఈ ఏడాది గణేశ్ నిమజ్జనం సాఫీగా సాగింది. ఉదయం 10 గంటల వరకే.. నిమజ్జన ప్రక్రియ పూర్తవుతుందని భావించినప్పటికీ క్రేన్ల వద్ద ఆలస్యం కావడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గణనాథులతో ట్యాంక్ బండ్.. పరిసరాలు సందడిగా మారాయి.గణేశ్ నిమజ్జనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సాఫీగా పూర్తి కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ సహా.. పోలీస్ యంత్రాంగం మట్టుత్తం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ.. ప్రక్రియ మొత్తం నిఘా కళ్లతో పర్యవేక్షించింది. నిమజ్జనానికి సహకరించిన సిబ్బంది, భక్తులకు.. ధన్యవాదాలు తెలిపిన సజ్జనార్.. తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసి అలరించారు."నిమజ్జనానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి. వేరే రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు నిమజ్జనంలో పాల్గొన్నారు. నిమజ్జనానికి ముందు రివ్యూ మీటింగ్, ఫీల్డ్ విజిటింగ్ చేశాం. నిమజ్జనానికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు ధన్యవాదాలు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా నిమజ్జనాలు జరిగాయి. ఖైరతాబాద్ వినాయక నిమజ్జనానికి 30 లక్షల మంది హాజరయ్యారు. బాలాపూర్ గణేశ్ నిమజ్జనానికి 15 లక్షల మంది హాజరయ్యారు. నిమజ్జనానికి బయటనుంచి ఉన్నత అధికారులు కూడా వచ్చారు. నిమజ్జనంలో ఈసారి పేపర్ షాట్ మిషన్లను ఎక్కువగా వాడారు.ఈ ఏడాది ఖైరతాబాద్ బడా గణేశుడిని 30 లక్షల మంది.. బాలపూర్ గణపతిని 15 లక్షల మందికిపైగా భక్తులు దర్శించుకున్నట్లు.. సీపీ తెలిపారు. ఇతర రాష్ట్రాల ప్రజలు కూడా నిమజ్జనాలను వీక్షించినట్లు పేర్కొన్నారు. నిమజ్జనాలు ప్రశాంతంగా ముగియడంతో ట్రాఫిక్ ఆంక్షలు ఎత్తి వేశారు. ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ వైపు రాకపోకలను పునరుద్ధరించారు.అయితే ఉదయం మాత్రం హైదరాబాద్ వాసులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి నుంచి జరుగుతున్నా ఇంకా వందలాది విగ్రహాలు నిమజ్జానికి వేచి ఉండటంతో ట్యాంక్‌బండ్ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. నిమజ్జనం వాహనాల కోసం పోలీసులు ట్యాంక్‌బండ్ చుట్టూ సాధారణ వాహనాలను అనుమతించలేదు. దీంతో ఉద్యోగాలు, పనులకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఖైరతాబాద్, లక్డీకపూల్, లిబర్టీ, నారాయణగూడ, హిమాయత్ నగర్, హైదర్ గూడ, బషీర్ బాగ్, లోయర్ ట్యాంక్ బండ్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

**రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరు**



**జగిత్యాల సెప్టెంబర్, 26 (ప్రజా మంటలు):** ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో జగిత్యాల నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరైన నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం ఎంపిక చేయాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు కేటాయించిన కోటా ప్రకారం అర్హులను ఎంపిక చేయాలని, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అదేవిధంగా మొదటి విడతలో జగిత్యాల నియోజకవర్గానికి మంజూరైన 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని కూడా సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. హౌసింగ్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని పేర్కొన్నారు.సమావేశంలో కమిషనర్ సత్య ప్రణవ్, ఎంపీడీవోలు రమాదేవి, చిరంజీవి, వాసవి, భీమేష్, నీరజతో పాటు అధికారులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో భూమి హక్కుల కోసం పోరాటం



**జగిత్యాల సెప్టెంబర్ 26 (ప్రజా మంటలు):** బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జగిత్యాల రూరల్ మండలం మొరపల్లి గ్రామంలోని ఆమె విగ్రహానికి రజక సంఘ నాయకులు, మహిళలు, గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ఒక సామాజిక వర్గానికే పరిమితం కాదని, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరనారి అని అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ సాధన ఉద్యమాన్ని ముందుకు నడిపారని పేర్కొన్నారు.రజకుల సంక్షేమానికి గత ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని, ధోబీఘాట్ల ఏర్పాటుతో పాటు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించిందని గుర్తు చేశారు. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో తెలంగాణలో భూమి హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గంగరాజం, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, రజక సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఆట ఆధారిత విద్య- డి డబ్ల్యు ఓ భాస్కర్



**జగిత్యాల సెప్టెంబర్ 26 (ప్రజా మంటలు):** మూడు నుంచి ఆరు సంవత్సరాల వయసున్న చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం వంటి ఆట ఆధారిత అభ్యాసం ఎంతో దోహదపడుతుందని జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ అన్నారు. పోషణ మాసంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ప్రారంభ బాల్య సంరక్షణ మరియు విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.చిన్నారుల్లో శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ, భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని భాస్కర్ తెలిపారు. పిల్లలకు చిన్న వయస్సు నుంచే పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలో చేరే ముందే విద్యకు సిద్ధం చేయాలని సూచించారు.పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, సమాజం సమష్టిగా భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు. చిన్నారులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించి వారి ప్రతిభను వెలికితీయాలని సూచించారు.సర్పంచ్ కవిత మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది అని అన్నారు. “ఆరోగ్యవంతమైన తల్లి.. ఆరోగ్యవంతమైన బిడ్డ.. ఆరోగ్యవంతమైన సమాజం” అనే లక్ష్యంతో ప్రతి కుటుంబం పిల్లల పోషణ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కార్యక్రమంలో సీడీపీఓ జయప్రద, ఏసీడీపీఓ రాజశ్రీ, పర్యవేక్షకులు పవిత్ర, లావణ్య, ఆరోగ్య వైద్య అధికారి శ్రీదేవి, సౌమ్య, అంగన్‌వాడీ టీచర్లు జయప్రద, పద్మజ, జలజ, రాజమణి, స్వప్న, జమున, సరిత, గీత, మమత, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ గాజుల నాగరాజుకు ఆర్థిక సాయం చేయండి



**జగిత్యాల, సెప్టెంబర్ 26 (ప్రజా మంటలు):** సీనియర్ జర్నలిస్ట్ గాజుల నాగరాజు గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన జగిత్యాలలో చికిత్స పొందారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని చల్మెడ ఆనందరావు మెడికల్ కాలేజీకి తరలించారు.నాగరాజు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం కోసం చురుకుగా పనిచేశారు. జర్నలిస్టుల బస్‌పాస్ రెన్యూవల్, రైల్వే పాస్‌ల రెన్యూవల్ వంటి పనులను స్వయంగా తీసుకెళ్లి పూర్తి చేయించి, వాటిని జర్నలిస్టుల ఇళ్లకు వెళ్లి అందించేవారని సహచరులు గుర్తు చేస్తున్నారు. ఆయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా జర్నలిస్టు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మూడు సార్లు ఎన్నికయ్యారు.ప్రస్తుతం నాగరాజు కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. జగిత్యాల ప్రెస్ క్లబ్ తరఫున కొంత ఆర్థిక సహాయం అందించినప్పటికీ, వైద్య ఖర్చులకు అది సరిపోవడం లేదు. భార్య, ఇద్దరు ఆడపిల్లలతో ఉన్న కుటుంబం రోజువారీగా వేల రూపాయల వైద్య ఖర్చులను భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది.ఈ నేపథ్యంలో జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగానికి చెందిన జర్నలిస్టు మిత్రులు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి, తోటి జర్నలిస్ట్ గాజుల నాగరాజు కుటుంబానికి అండగా నిలవాలని జర్నలిస్టు వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

## అంగన్‌వాడీ కేంద్రం లో చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు మెరుగైన పోషకాహారం



**గొల్లపల్లి సెప్టెంబర్ 26 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని వెంగలాపూర్ నందిపల్లి గర్భిణీ స్త్రీలకు , చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన “పోషణ మాసం” కార్యక్రమంలో సిడిపిఓ వీరలక్ష్మి మాట్లాడుతూ,అంగన్‌వాడీ కేంద్రాల సేవలు, చిన్నారులకు అందుతున్న పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. “మన అంగన్‌వాడీ -- మన బాధ్యత” చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఉందని చిన్నారుల్లో రక్తహీనతను నివారించడంతో పాటు, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన అలవాట్లపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో వేడి వంటకాలు, పోషకాహార పంపిణీ, బాలల సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు.గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి, పసుపు--కుంకుమ, పండ్లు అందజేసి ఆశీర్వదించారు. గర్భధారణ సమయంలో తల్లులు సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సిడిపిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జ్యోతి అంగన్వాడీ టీచర్లు సరోజన, రజిత, ఆయాలు గర్భవతులు బాలింతలు తల్లులు పిల్లలు కిషోర్ బాలికలు పాల్గొన్నారు

## ఉమ్మడి జిల్లాలో మెరిసిన మేడిపల్లి మండల ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు




**గొల్లపల్లి సెప్టెంబర్ 26 ప్రజా మంటలు :** కరీంనగర జిల్లా అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్ 19 బాలికల ఖోఖో పోటీలలో పాల్గొని హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ప్రత్యర్థి జట్టుపై ఘన విజయం సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా విజేతలుగా మేడిపల్లి మండల ఆదర్శ పాఠశాల విద్యార్థినిలు నిలిచారు.మొదటి స్థానం గెలుపొందిన విద్యార్థులను మేడిపల్లి మండల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగ సుధరాణి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు

## ఖైరతాబాద్‌బరిలో టీఆర్ఎల్‌డీ

**మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్**



**సికింద్రాబాద్,సెప్టెంబర్ 26 (ప్రజామంటలు) :** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల బరిలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టీఆర్ఎల్‌డీ) నిలవనుంది. ఈ ఉప ఎన్నికలో తమ పార్టీ తరఫున అభ్యర్థిని పోటీకి దింపుతున్నట్లు తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ స్పష్టం చేశారు.స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల పక్షాన నిలిచి నిరంతరం పోరాటం చేయడమే లక్ష్యంగా ఎన్నికల బరిలోకి దిగుతున్నామని, ఈ ఎన్నికల్లో ప్రజలు తమను ఆదరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## సర్కారు బడి కోసం జర్నలిస్టుల కృషి అభినందనీయం

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 26 ( ప్రజా మంటలు):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పాటుపడుతున్న జర్నలిస్టుల కృషి ఎంతో అభినందనీయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజ హితం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే ఇలాంటి పాత్రికేయులు చాలా అరుదుగా ఉంటారని ఆయన కొనియాడారు.బోయిగూడలోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈ. చంద్రశేఖర్ (సాక్షి), ప్రతినిధి వి.జె. శేషగిరిరావు (ఆంధ్రజ్యోతి)లతో పాటు కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు శనివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పేద విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకునేందుకు వీలుగా ఈ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ఇందుకు సహకారం అందించాలని తల్లిదండ్రులు, విద్యార్థుల తరఫున కమిటీ ప్రతినిధులు ఆయనకు వినతిపత్రం అందజేశారు.ఈ వినతిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. పేద విద్యార్థులకు హైస్కూల్ విద్య అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తూ, తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అప్‌గ్రేడేషన్ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులకు తగిన సిఫారసు చేస్తానని కిషన్‌రెడ్డి వారికి భరోసా కల్పించారు.

## ఘనంగా ‘సేఫ్‌కాన్-26’ జాతీయ సదస్సు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 26 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అనస్థీషియా విభాగం, ‘ఎపైస్’ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల ప్రతిష్టాత్మక ‘సేఫ్‌కాన్--26’ జాతీయ సదస్సు శనివారం ఘనంగా ముగిసింది. శుక్రవారం గాంధీ మెడికల్ కాలేజీలో ప్రారంభమైన ఈ సదస్సు, రెండో రోజు శనివారం సికింద్రాబాద్‌లోని మినర్వా హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో కొనసాగింది.ఈ సదస్సులో గాంధీ అనస్థీషియా ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ ఆవుల మురళీధర్, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, హెచ్‌వోడీ డాక్టర్ బి. శ్రీనివాస్, ఆర్థో ప్రొఫెసర్ డాక్టర్ శేఖర్, అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ అదితి, డాక్టర్ బబితతో పాటు పలువురు ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది ప్రతినిధులు, బ్రిటన్ (యూకే) నుంచి పలువురు నిపుణులు హాజరై అనస్థీషియా విభాగంలో ఆధునిక పద్ధతులు, రోగుల భద్రతా ప్రమాణాలపై విస్తృతంగా చర్చించారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలి

**ఎస్ఐఆర్‌పై సిట్‌తో దర్యాప్తు చేయాలి: శేర్ నర్సారెడ్డి**



**హైదరాబాద్ సెప్టెంబర్ 26 (ప్రజా మంటలు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు.ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓటర్ల పేర్లు తొలగించడంపై సమగ్ర విచారణ అవసరమని, ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు పూర్తి పారదర్శకత అవసరమని పేర్కొన్నారు.

# రేవంత్ ‘నిజాయతీ గల మోసగాడు’- కేటీఆర్

**రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్**

**హామీలు అమలు కాలేదని ఆరోపణ**

**కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి**

**2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా**

**సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు**



సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ ‘నిజాయతీ గల మోసగాడు’ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు.తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి ‘అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు’ తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు.2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## మన్మోహన్‌కు ‘భారతరత్న’ ఇవ్వాలి- ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ**

**పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య**

**మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస**



మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం ‘భారతరత్న’ ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.మన్మోహన్ సింగ్ జీవితం నేటి ‘జెన్-జెడ్’ సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల పర్యాటక వైభవం

# ప్రకృతిని కాపాడుతూ ప్రయాణిద్దాం

**చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యాల సమ్మేళనంగా జగిత్యాల జిల్లా**

**తెలంగాణ పర్యాటక వైభవంలో జగిత్యాల జిల్లా ప్రత్యేక స్థానం**

**ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం**

**జగిత్యాల, సెప్టెంబర్ 26: (ప్రజా మంటలు) :** కొత్త ప్రాంతాలను చూడాలనే ఆసక్తి, అక్కడి ప్రజల జీవన విధానం, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి చేసే ప్రయాణాలు మధురానుభూతులను మిగిల్చడం తో పాటు , రోజు వారి జీవన ప్రయాణంలో ఒత్తిడినితగ్గిస్తూ , మన పరిజ్ఞానాన్ని విస్తరింపజేస్తాయి. విభిన్న ప్రాంతాల సంస్కృతులను పరిచయం చేస్తాయి. ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కల్పిస్తాయి. చరిత్రను తెలుసుకునే మార్గాన్ని చూపుతాయి.అయితే పర్యాటకం తో పాటు బాధ్యత కూడా ఉండాలి. మన ప్రయాణం వల్ల ప్రకృతికి, చారిత్రక కట్టడాలకు, స్థానిక ప్రజల జీవన విధానానికి ఎలాంటి నష్టం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పర్యాటకుడి పైనా ఉంది. పర్యావరణహిత, బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు మన సహజ, చారిత్రక, సాంస్కృతిక సంపదను అందించవచ్చు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ పర్యాటక వైభవాన్ని గుర్తుచేసుకోవడం సముచితం. తెలంగాణలో చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. వాటిలో జగిత్యాల జిల్లాకు ప్రత్యేకమైన స్థానం ఉంది. చరిత్ర, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, గోదావరి నదీ సంస్కృతి, గ్రామీణ జీవన విధానం కలగలిసిన ప్రాంతంగా జగిత్యాల జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందుతోంది. కొండలు, నదులు, దేవాలయాలు, కోటలు, పురాతన కట్టడాలు, పచ్చని పంట పొలాలు, గ్రామీణ వాతావరణం పర్యాటకులను ఆకట్టుకునే విశేష సంపదగా నిలుస్తున్నాయి.కొండగట్టు -- జగిత్యాల పర్యాటకానికి మణిహారం మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిసరాల్లోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రం జిల్లాలోనే కాకుండా తెలంగాణలో ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా నిలుస్తోంది. కొండల మధ్య ప్రకృతి ఒడిలో వెలసిన ఈ క్షేత్రానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. కొండగట్టు ప్రత్యేకత కేవలం ఆలయానికే పరిమితం కాదు. ఆలయ పరిసరాల్లోని కొండలు, పచ్చని చెట్లు, వర్షాకాలంలో కనిపించే ప్రకృతి సోయగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించగలిగే ప్రాంతంగా కొండగట్టు ప్రత్యేక గుర్తింపు పొందింది. పర్యాటకుల రాక పెరుగుతున్న నేపథ్యంలో కొండగట్టు పరిసరాల్లో పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.ధర్మపురి -- గోదావరి తీరాన ఆధ్యాత్మిక వైభవం గోదావరి నది తీరంలో వెలసిన ధర్మపురి జగిత్యాల జిల్లాలో మరో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఇక్కడి ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ దర్శనంతో పాటు గోదావరి నదీ తీరంలోని ప్రకృతి అందాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. నదీ తీర ప్రాంతం భక్తులకు, పర్యాటకులకు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. ఆధ్యాత్మికత, నదీ సంస్కృతి, ప్రకృతి సౌందర్యం కలిసిన ప్రాంతంగా ధర్మపురి ప్రత్యేకతను సంతరించుకుంది. గోదావరి నది జిల్లాలోని పలు ప్రాంతాలకు సహజసిద్ధమైన అందాన్ని అందిస్తోంది. నదితో ముడిపడిన స్థానిక సంస్కృతి, పండుగలు, సంప్రదాయాలు కూడా పర్యాటకులకు ఆసక్తిని కలిగిస్తాయి.జగిత్యాల కోట -- చరిత్రకు సజీవ సాక్ష్యం జగిత్యాల పట్టణంలోని చారిత్రక కోట జిల్లాకు గర్వకారణమైన వారసత్వ కట్టడాల్లో ఒకటి. నక్షత్రాకార నిర్మాణ శైలి, కోట చుట్టూ ఉన్న చారిత్రక నేపథ్యం పర్యాటకులను ఆకర్షించే అంశాలు. చారిత్రక కట్టడాలు కేవలం రాళ్లు, గోడలు మాత్రమే కావు. అవి గత తరాల జీవన విధానం, నిర్మాణ నైపుణ్యం, పాలనా చరిత్రకు సజీవ సాక్ష్యాలు. అందువల్ల జగిత్యాల కోట వంటి వారసత్వ కట్టడాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత.కొండగట్టు, ధర్మపురి, జగిత్యాల కోటలను అనుసంధానిస్తూ సమగ్ర పర్యాటక మార్గాలను అభివృద్ధి చేస్తే జిల్లాలో పర్యాటక అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. కోటిలింగాల -- శాతవాహన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం జగిత్యాల జిల్లా చారిత్రక వైభవాన్ని ప్రతిబింబించే అత్యంత ముఖ్యమైన ప్రాంతాల్లో కోటిలింగాల ఒకటి. గోదావరి, పెద్దవాగు సంగమ ప్రాంతంలో ఉన్న ఈ ప్రాంతానికి ప్రాచీన చరిత్రలో విశిష్ట స్థానం ఉంది.ధర్మపురికి సుమారు 19 కిలోమీటర్లు, కరీంనగర్ కు సుమారు 55 కిలోమీటర్లు, హైదరాబాద్ కు సుమారు 218 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటిలింగాల ప్రస్తుతం గ్రామీణ వాతావరణంలో ఉన్నప్పటికీ, గతంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన చారిత్రక ప్రాంతంగా వెలుగొందింది. శాతవాహనుల కాలానికి సంబంధించిన నాణేలు, పురావస్తు అవశేషాలు ఈ ప్రాంత ప్రాచీనతను చాటుతున్నాయి. శాతవాహనుల తొలి రాజధానిగా కోటిలింగాల కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. పురావస్తు తవ్వకాలలో లభించిన నాణేలు, మట్టి పాత్రలు, ఇతర అవశేషాలు అప్పటి నాగరికత, వాణిజ్య కార్యకలాపాలపై విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. గోదావరి తీరంలో ఉన్న కోటిలింగాల చారిత్రక ప్రాధాన్యం తో పాటు ప్రకృతి సౌందర్యానికి కూడా నిలయంగా ఉంది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసరాలు, గోదావరి బ్యాక్‌వాటర్ ప్రాంతం పర్యాటక అభివృద్ధికి అవకాశాలను కల్పిస్తున్నాయి. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బోటింగ్ వంటి సదుపాయాలు కూడా పర్యాటక ఆకర్షణను పెంచుతున్నాయి.కోటిలింగాల ను చరిత్ర, పురావస్తు, ఆధ్యాత్మికత, ప్రకృతి పర్యాటకాల ను కలిపిన ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అవకాశం ఉంది.వాల్గొండ -- గోదావరి తీరాన త్రికూటాలయ వైభవం జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్ మండలంలోని వాల్గొండ గోదావరి నదీ తీరాన ఉన్న మరో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశం. గోదావరి ఒడ్డున కొండ ప్రాంతం వైపు వాలుగా ఉన్న భౌగోళిక స్వరూపం కారణంగా ఈ ప్రాంతానికి వాల్గొండ అనే పేరు ఏర్పడినట్లు స్థానిక చరిత్రలో పేర్కొంటారు. గోదావరి తీరంలోని గుట్టపై ఉన్న త్రికూటాలయం ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ. చాళుక్యుల కళా రీతులను ప్రతిబింబించే నిర్మాణ శైలి ఈ ఆలయానికి చారిత్రక ప్రాధాన్యాన్ని కల్పిస్తోంది. రాయికల్ ప్రాంతంలోని త్రికూటాలయ నిర్మాణ శైలిని పోలిన శిల్పకళా లక్షణాలు ఇక్కడ కనిపిస్తాయి.వాల్గొండ చుట్టూ పచ్చని పంట పొలాలు, గుట్టలు, గోదావరి నదీ ప్రవాహం, ప్రకృతి సిద్ధమైన అందాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. పక్షుల సందడి, పంట పొలాల మధ్య గ్రామీణ వాతావరణం ఈ ప్రాంతానికి మరింత రమణీయతను అందిస్తున్నాయి.ప్రకృతి అందాలతో పాటు చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉన్న వాల్గొండ ను పర్యాటక పటంలో మరింతగా పరిచయం చేయాల్సిన అవసరం ఉంది.రాయికల్, మెట్‌పల్లి ప్రాంతాలు -- గ్రామీణ పర్యాటకానికి అవకాశాలు జిల్లాలోని రాయికల్, మెట్‌పల్లి ప్రాంతాలు గ్రామీణ జీవన విధానం, వ్యవసాయ సంస్కృతి, స్థానిక ఆహార సంప్రదాయాలు, జానపద కళలను పరిచయం చేసే అవకాశాలను కలిగి ఉన్నాయి. గ్రామీణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా స్థానిక ప్రజలకు అదనపు ఆదాయ మార్గాలు ఏర్పడవచ్చు. స్థానికంగా తయారయ్యే ఆహార పదార్థాలు, హస్తకళలు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ లభించవచ్చు. స్థానిక యువతకు టూరిస్ట్ గైడ్లు, హోమ్‌స్టేలు, రవాణా, ఆతిథ్య రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు. గోదావరి -- జగిత్యాల పర్యాటకానికి సహజ వరంలిగోదావరి నది జగిత్యాల జిల్లాకు ప్రకృతి ప్రసాదించిన గొప్ప వరం. గోదావరి తీర ప్రాంతాల్లోని పచ్చని పొలాలు, గుట్టలు, నదీ ప్రవాహం, గ్రామీణ వాతావరణం పర్యాటకులను ఆకట్టుకునే సహజ వనరులు. కోటిలింగాల, వాల్గొండ, ధర్మపురి తదితర గోదావరి పరివాహక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ పర్యావరణహిత పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయవచ్చు. అయితే నదీ పర్యాటక అభివృద్ధి పేరుతో గోదావరి నదిని, నదీ పరిసరాలను కలుషితం చేయకుండా ప్రత్యేక



జాగ్రత్తలు తీసుకోవాలి.లిపర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రతే ప్రధాన బాధ్యత పర్యాటక ప్రాంతాల అందాన్ని కాపాడటంలో పరిశుభ్రత కీలకం. కొండగట్టు, ధర్మపురి, కోటిలింగాల, వాల్గొండ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలి.ప్రతి పర్యాటకుడు చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోని చెత్త కుండీల్లోనే వేయాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తగ్గించాలి. పునర్వినియోగ సీసాలు, సంచులను వినియోగించాలి. గోదావరి నదిలో చెత్త, ప్లాస్టిక్, పూజా సామగ్రిని పడవేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.లిస్థానికులకు ప్రయోజనం కలిగేలా పర్యాటక అభివృద్ధిలిపర్యాటకం అభివృద్ధి చెందితే దాని ప్రయోజనం స్థానిక ప్రజలకు చేరాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ లభించాలి. స్థానిక కళాకారులు, హస్తకళాకారులను ప్రోత్సహించాలి. స్థానిక ఆహార పదార్థాలు, జానపద కళలు, గ్రామీణ జీవన విధానాన్ని పర్యాటకులకు పరిచయం చేయడం ద్వారా జగిత్యాల ప్రత్యేకతను మరింతగా చాటవచ్చు.విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించాలిలిపర్యాటక ప్రాంతాల పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించాలి. స్థానిక చరిత్ర, వారసత్వ కట్టడాలు, ప్రకృతి వనరుల ప్రాధాన్యాన్ని వారికి వివరించాలి. కొండగట్టు , ధర్మపురి ఆలయాల చరిత్ర, ఆధ్యాత్మిక విశిష్టత, సాంస్కృతిక ప్రాధాన్యం మరియు జగిత్యాల కోట ప్రత్యేకత, కోటిలింగాల శాతవాహన చరిత్ర, వాల్గొండ త్రికూటాలయ విశిష్టతలను విద్యార్థులకు పరిచయం చేయాలి. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, మొక్కల సంరక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలి. లిఅభివృద్ధి పేరుతో ప్రకృతికి నష్టం చేయొద్దు పర్యాటక రంగం అభివృద్ధి చెందాల్సిందే. అయితే అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీయకూడదు. పర్యాటక ప్రాంతాలను అనవసరమైన కాంక్రీట్ నిర్మాణాలతో నింపకుండా, స్థానిక పర్యావరణ పరిస్థితులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలి. కొండలు, నదులు, చెట్లు, పక్షులు, వన్యప్రాణులు, చారిత్రక కట్టడాలు పర్యాటకానికి మూలసంపద. వాటిని సంరక్షిస్తూ అభివృద్ధి చేయడమే సుస్థిర పర్యాటకానికి నిజమైన అర్థం.జగిత్యాల పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం కొండగట్టు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిస్తే.. ధర్మపురి గోదావరి తీర ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. జగిత్యాల కోట చారిత్రక వారసత్వానికి గుర్తుగా నిలుస్తోంది. కోటిలింగాల శాతవాహనుల ప్రాచీన చరిత్రను గుర్తుచేస్తోంది. వాల్గొండ చాళుక్యుల కాలపు త్రికూటాలయ నిర్మాణ కళకు, గోదావరి తీర ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలుస్తోంది.ఈ వైవిధ్యాన్ని సమర్థంగా ప్రచారం చేస్తూ, పర్యాటక ప్రాంతాలను పరస్పరం అనుసంధానం చేస్తే జగిత్యాల జిల్లాలో పర్యాటక రంగానికి మరింత విస్తృత అవకాశాలు ఏర్పడతాయి. అదే సమయంలో స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరగడంతో జిల్లా ఆర్థికాభివృద్ధికి కూడా పర్యాటకం దోహదపడుతుంది.బాధ్యతాయుత పర్యాటకమే భవిష్యత్ మార్గం పర్యాటకం మన ఆనందం కోసం మాత్రమే కాదు. మన చరిత్రను తెలుసుకోవడానికి, సంస్కృతిని అర్థం చేసుకోవడానికి, ప్రకృతిని ఆస్వాదించడానికి ఒక గొప్ప అవకాశం. కొండగట్టుకు వెళ్తే కొండల పరిశుభ్రతను కాపాడాలి.

**ధర్మపురికి వెళ్తే గోదావరిని కలుషితం చేయకూడదు.**

**జగిత్యాల కోటను సందర్శిస్తే చారిత్రక కట్టడాన్ని గౌరవించాలి.**

**కోటిలింగాల కు వెళ్తే పురావస్తు అవశేషాలను సంరక్షించాలి.**

**వాల్గొండను సందర్శిస్తే ఆలయ వైభవంతో పాటు ప్రకృతి సౌందర్యాన్ని కాపాడాలి.**

**గ్రామీణ ప్రాంతాలను సందర్శిస్తే స్థానిక ప్రజల జీవన విధానాన్ని గౌరవించాలి.**

**ప్రకృతిని ఆస్వాదిద్దాం.. కానీ ప్రకృతిని నాశనం చేయకూడదు.**

**చరిత్రను తెలుసుకుందాం.. కానీ చారిత్రక కట్టడాలను దెబ్బతీయకూడదు.**


**స్థానిక సంస్కృతిని తెలుసుకుందాం.. కానీ స్థానికుల మనోభావాలను గౌరవించాలి. జగిత్యాల పర్యాటక సంపదను ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంత ఉందో, దానిని భావితరాల కోసం సంరక్షించాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.పర్యాటకం స్థానికులకు ఉపాధి ఇవ్వాలి.పర్యాటకం ప్రకృతిని రక్షించాలి.**

**పర్యాటకం చరిత్రను కాపాడాలి.**

పర్యాటకం భావితరాలకు సంపదను అందించాలి."ప్రకృతిని కాపాడుతూ.. పర్యావరణ సమతుల్యతను పరిరక్షిస్తూ.. భావి తరాలకు మన జగిత్యాల సహజ, చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని అందించడం మనందరి బాధ్యత. జగిత్యాల జిల్లా పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుతూ, ప్రకృతితో మమేకమైన బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహిద్దాం."

## కృష్ణ నదిపై లగ్జరీ హౌస్‌బోట్, పార్టీ క్రూజ్ సందడి  పర్యాటక రంగంలో మరో కొత్త ఆకర్షణ

కృష్ణా నదిలో మరో కొత్త ఆకర్షణ త్వరలో అందుబాటులోకి రానుంది. నదిపై ప్రయాణమే కాదు. పడవలోనే హోటల్ సౌకర్యాలు, భోజనం, వినోదం, పార్టీలు నిర్వహించుకునేలా లగ్జరీ హౌస్ బోట్, పార్టీ, డిన్నర్ క్రూజ్ రానున్నాయి. కృష్ణా నదిలో పర్యాటకులకు మరో కొత్త ఆకర్షణ త్వరలో అందుబాటులోకి రానుంది. నదిపై విహారంతో పాటు పడవలోనే హోటల్ సౌకర్యాలు, భోజనం, వినోదం, పార్టీలు, ప్రత్యేక వేడుకలు ఒకే వేదికపై నిర్వహించుకునేలా లగ్జరీ హౌస్‌బోట్, పార్టీ, డిన్నర్ క్రూజ్‌లను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇందుకోసం ఓ ప్రైవేట్ సంస్థ బోట్ల నిర్మాణ పనులను ప్రారంభించింది. సుమారు రూ.30 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు నాలుగైదు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం కృష్ణా నదిలో కేరళం తరహా హౌస్‌బోట్ సేవలు ఇప్పటికే నిర్వహిస్తున్నారు. కొత్తగా రానున్న రెండు భారీ బోట్లతో పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలోని స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులను కూడా ఇవి ఆకర్షించే అవకాశముందని భావిస్తున్నారు.ప్రత్యేకతలు ఇవే: కృష్ణా నదిలో ప్రవేశపెట్టే లగ్జరీ బోటులో ఐదు పడక గదులు, విశాలమైన లివింగ్ ఏరియా, హోటల్ తరహా సౌకర్యాలు ఉండనున్నాయి. ఒకేసారి 100 మంది భోజనం చేసేలా ఏసీ డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కేరళం, కశ్మీర్‌లలో ప్రస్తుతం లగ్జరీ హౌస్‌బోట్లు నడుపుతున్నారు. వీటిలో రాత్రిపూట బస చేస్తూ నదిలో విహరించే అవకాశం ఉంటుంది. ఇలాంటి అవకాశం మన దగ్గరా కృష్ణా నది వేదికగా పర్యాటకులకు త్వరలో అందుబాటులోకి రానుంది.200 మందికి పార్టీ-డిన్నర్ క్రూజ్: పార్టీ, డిన్నర్ క్రూజ్, లగ్జరీ హౌస్‌బోట్ కంటే మరింత భారీగా



ఉండనుంది. కృష్ణా నదిలో ప్రవేశపెట్టే క్రూజ్‌లో 200 మంది ఒకేసారి పార్టీలు, డిన్నర్లు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, కుటుంబ వేడుకలు, కార్పొరేట్ సమావేశాలు, ప్రత్యేక కార్యక్రమాలకు అనువుగా ఈ క్రూజ్‌ను రూపుదిద్దుతున్నారు. దుబాయ్, లండన్, గోవా వంటి ప్రాంతాల్లో ఉన్న క్రూజ్‌ల తరహాలో ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.విజయవాడలో కృష్ణా నదిలో ఇప్పటికే ప్రవేశపెట్టిన హౌస్ బోట్‌లో బెడ్ రూం, లివింగ్ ఏరియా, హోటల్ తరహా సౌకర్యాలు ఉన్నాయి. తేలియాడే రెస్టారెంట్‌గా వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ పార్టీలు, వేడుకలకు కూడా ఉపయోగించుకునేలా డిజైన్ చేశారు.పర్యాటకానికి మరింత ఊతం: విజయవాడలో కృష్ణా నదిలో ఇప్పటికే భవానీ ఐలాండ్, పవిత్ర సంగమం వంటి పర్యాటక కేంద్రాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. కొత్త హౌస్‌బోట్, పార్టీ-డిన్నర్ క్రూజ్‌లను ఈ పర్యాటక ప్రదేశాలతో అనుసంధానించడం ద్వారా భోజనం, విహారం, బస, వినోదాన్ని ఒకే ప్యాకేజీగా అందించే అవకాశం ఏర్పడనుంది. దీంతో కృష్ణా నదిపై పర్యాటక కార్యకలాపాలు మరింత విస్తరించి, విజయవాడకు కొత్త పర్యాటక ఆకర్షణగా ఈ ప్రాజెక్టు నిలవనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## టాటా చెప్పేసిన 'నైరుతి'.. చివరి రోజుల్లో కాస్త ఊరట

**తెలంగాణలో 15 శాతం లోటుతో ముగిసిన నైరు  చివరి నాలుగు రోజుల వర్షాలతో భారీగా తగ్గిన**

**లోటు శనివారం నుంచి రాష్ట్రంలో పెరగనున్న ఉక్కపోత  భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న**

**గోదావరి వరద  భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం**



తెలంగాణలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసింది. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు నిరాశే మిగిల్చినా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం చివరి రోజుల్లో ఆదుకుంది. గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన విస్తారమైన వర్షాల కారణంగా వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. సీజన్ మొత్తం మీద 20 శాతంగా ఉన్న లోటు, ఈ వర్షాలతో 15 శాతానికి పరిమితమైంది.సెప్టెంబర్ 22వ తేదీ వరకు రాష్ట్రంలో 34 శాతం లోటు వర్షపాతం నమోదైంది. అయితే గత నాలుగు రోజుల్లో కురిసిన భారీ వర్షాలతో ఈ నెల లోటు కేవలం 4 శాతానికి పడిపోయింది. ఈ కొద్దిరోజుల్లోనే సగటున 52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావడం విశేషం. ఈ వర్షాలకు ముందు 18 జిల్లాల్లో లోటు వర్షపాతం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 14కు తగ్గింది. అయితే, ఏ జిల్లాలోనూ అధిక వర్షపాతం నమోదు కాలేదు.మరోవైపు, భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 20.2 అడుగులకు చేరిన ప్రవాహం, నేడు (శనివారం) నాటికి 30 అడుగులకు చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాద్రి జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ అప్రమత్తం చేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో వర్షపు నీరు గనుల్లోకి చేరడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది.వాయుగుండం ప్రభావం ముగియడంతో శనివారం నుంచి రాష్ట్రంలో ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. రేపటి (ఆదివారం) నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వేడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## తెలంగాణలో డిగ్రీ విద్యకు గడ్డుకాలం.. ఐదేళ్లలో 335 కాలేజీల క్లోజ్!

**ఈ ఏడాది 56 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాని వైనం**

**ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడమే కారణమంటున్న యాజమాన్యాలు**

**ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.2,000 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆరోపణ**

**వరుసగా మూడేళ్లు 25 శాతం సీట్లయినా నిండకపోతే కాలేజీలు మూతపడే ప్రమాదం**




తెలంగాణలో ప్రైవేటు డిగ్రీ విద్య తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. విద్యార్థుల నుంచి ఆదరణ తగ్గడం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఏటా పదుల సంఖ్యలో కాలేజీలు మూతపడుతున్నాయి. గత ఐదేళ్ల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 335 ప్రైవేటు డిగ్రీ కాలేజీలకు తాళాలు పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2021లో 1,100గా ఉన్న మొత్తం డిగ్రీ కాలేజీల సంఖ్య, ప్రస్తుతం 783కి పడిపోయింది.తాజాగా ముగిసిన మూడు విడతల 'దోస్త్' కౌన్సెలింగ్ తర్వాత కూడా సగానికి పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది 9 జిల్లాల పరిధిలోని 56 కాలేజీల్లో మొత్తం 16,460 సీట్లు ఉండగా, ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కాలేదు. నిబంధనల ప్రకారం, వరుసగా మూడేళ్లపాటు 25 శాతం సీట్లు భర్తీ కాని కాలేజీల గుర్తింపును రద్దు చేస్తారు. దీంతో ఈ విద్యా సంవత్సరంలో మరో 50కి పైగా కాలేజీలు మూతపడే ప్రమాదం ఏర్పడింది. ఒకప్పుడు నల్గొండ జిల్లాలో ప్రముఖంగా ఉన్న 4 దశాబ్దాల చరిత్ర గల నీలగిరి డిగ్రీ కాలేజీ సైతం గతేడాది మూతపడింది.ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడమే ఈ దుస్థితికి కారణమని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాల సంఘం ఆరోపిస్తోంది. ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు ఇస్తున్న ప్రాధాన్యం డిగ్రీకి ఇవ్వడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద తమకు దాదాపు రూ.2,000 కోట్లు రావాల్సి ఉందని సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతోనే కాలేజీలను మూసివేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గురువారం నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో, విద్యార్థులు నేరుగా కాలేజీల్లో చేరేందుకు అవకాశం కల్పించారు.

## తెలంగాణలో 200 కొత్త జూనియర్ సివిల్ కోర్టులు.. కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం

**తెలంగాణలో 200 కొత్త జూనియర్ సివిల్ కోర్టుల ఏర్పాటుకు ఆమోదం**

**తొలి దశలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ**

**కేసుల భారం తగ్గించి, సత్వర న్యాయం అందించడమే లక్ష్యం**

**అత్యధికంగా హైదరాబాద్ మెట్రో పరిధిలోనే 71 కోర్టుల కేటాయింపు**



రాష్ట్రంలో న్యాయవ్యవస్థను బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో తొలి విడతలో 200 కొత్త అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయ వ్యవహారాల కార్యదర్శి బి. పాపిరెడ్డి ఈ నెల 24న జీవో ఎంఎస్ నెం.59 జారీ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 594 కొత్త కోర్టులు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఆమోదంతో మొదటి దశలో 200 కోర్టులను మంజూరు చేసింది. కక్షిదారులకు కోర్టులను మరింత చేరువ చేయడం, ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తులపై పని భారాన్ని తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం తన ఉత్తర్వులలో స్పష్టం చేసింది.కొత్తగా మంజూరైన కోర్టులలో అత్యధికంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోనే 71 కోర్టులు ఏర్పాటు కానున్నాయి. ఇందులో రంగారెడ్డి జిల్లాకు 30, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ జిల్లాకు 16 కోర్టులు కేటాయించారు. ఇతర జిల్లాలైన నల్గొండకు 10, సంగారెడ్డి, ఖమ్మంలకు చెరో ఎనిమిది చొప్పున కోర్టులు మంజూరయ్యాయి.2025 జూన్ నాటికి రాష్ట్రంలోని జిల్లా కోర్టులలో సుమారు 9.38 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త కోర్టుల ఏర్పాటు కేసుల విచారణను వేగవంతం చేస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. అయితే, ఇది కేవలం కోర్టుల ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వు మాత్రమే. సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే ఈ కోర్టులు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తాయి.

## స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు

**స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష**

**సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్**

**క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన**

**కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం**




ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిన్న సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, నివేదించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీతో ఈ భేటీ నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ విధివిధానాలు, బాధ్యతలపై పవన్ కల్యాణ్ సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమగ్ర సమాచారంతో నివేదికలు సిద్ధం చేయాలని, సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు వివరాలను తనకు నివేదించాలని సూచించారు. కమిటీ కార్యకలాపాలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు సోమవారం మరోసారి సమావేశం కావాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, పులపర్తి ప్రశాంత్, యనమల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com